క్లుప్తంగా

బాలల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కపిలేశ్వరపురం: చిన్నారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన సచివాలయాల మహిళా పోలీసులు అన్నారు. వల్లూరు, వెదురుమూడి, అంగర తదితర గ్రామాల సచివాలయాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా పోలీసులు సందర్శించారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై సీఆర్ యాప్ నిర్వహణ తీరును పర్యవేక్షించారు. వెదురుమూడిలోని రెండో నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామ పోలీస్ గెడ్డం ప్రమీల సందర్శించి చిన్నారులకు ఆట పాటలను నేర్పించారు.

హైస్కూల్‌కు వంట పాత్రలు పంపిణీ



నిర్వాహకులకు వంటపాత్రలు అందిస్తున్న తహసీల్దార్ శర్మ తదితరులు

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలకు బుధవారం వంటపాత్రలను పంపిణీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందించిన వంట పాత్రలను తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, ఎంఈఓ ఎ.నాగరాజు, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ తదితరులు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల ఆరోగ్యం కోసం జగనన్న గోరు ముద్ద పథకం ప్రారంభించి నేటికీ సంపూర్ణ ఆరోగ్య ఆహారాన్ని అందిస్తోందన్నారు. నిర్వాహకులు ప్రభుత్వం అందిస్తున్న ఆహారంతో విద్యార్థులకు రుచిగా, శుభ్రంగా వండి పెట్టాలని సూచించారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓ నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు ప్రక్కి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

నేడు పడమర ఖండ్రికలో అభివృద్ధి పనుల ప్రారంభం

కపిలేశ్వరపురం (మండపేట): కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రికలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా గురువారం ప్రారంభించనున్నట్టు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి బుధవారం తెలిపారు. రూ.87 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు నిర్మాణాలను ఎమ్మెల్సీ తోట ప్రారంభిస్తారన్నారు.

దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలి

కాజులూరు: దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలని తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం మండలంలోని మొగలిపాలెంలో ఏఓ వి.అశోక్ అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టా కాలువలకు నీరు నిలుపుదల చేస్తున్నట్టు నీటిపారుదల శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారన్నారు. అయితే ఈ ఏడాది మండల గ్రామాల్లో తొలకరి మాసూళ్ల పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, కనీసం డిసెంబర్ తొలివారం వరకైనా మండలంలో పూర్తి స్థాయిలో వెదచల్లికలు, నాట్లు పూర్తి చేయాలన్నారు. లేకుంటే దాళ్వా పంట చివరి దశలో సాగునీరందని పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ అనుషా, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి, రైతులు నల్లమిల్లి బుల్లివెంకటరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి, నున్న గోవిందురాజులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మెర్లపాలెం విద్యార్థిని

ఆత్రేయపురం: మెర్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థిని చింతల అనూష రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం సీహెచ్ శ్రీహరి, పీఈటీ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. ఇటీవల కాకినాడ డీఎస్‌ఏ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు చెప్పారు. విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంఈఓ వరప్రసాద్, సర్పంచ్ మెర్లరాము, మాజీ సర్పంచ్ జంపన సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు త్రిమూర్తులు, వీర్రాజు ఆమెను అభినందించారు.

విజ్ఞాన వికాస కేంద్రం గ్రంథాలయం

- గ్రంథ పఠనం ప్రాధాన్యతను చాటి చెప్పిన వారోత్సవాలు
- ఖాళీ సమయాన్ని గ్రంథాలయానికి కేటాయించడం మేలు
- విద్యా సంవత్సరం చివరిలో పెరిగిన ప్రాధాన్యత
- పోటీ పరీక్షల అభ్యర్థులకు మేలు
- సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి

కపిలేశ్వరపురం: అన్నింటా ఆధునికత ఆవరించడంతో జీవన యానం సౌకర్యవంతమైంది. ప్రపంచం మొత్తాన్ని వివరించే శక్తివంతమైన ఆయుధం పుస్తకం. మానవ విజ్ఞాన వికాసానికి మార్గదర్శి పుస్తకం. అంతటి పుస్తక పఠనం ప్రాధాన్యతను ఈ నెల 14 నుంచి 20 వరకూ వారం రోజుల పాటు నిర్వహించిన జాతీయ 56 వారోత్సవ కార్యక్రమాలు చాటి చెప్పాయి. విజ్ఞాన వికాస కేంద్రం గ్రంథాలయం ప్రాధాన్యతపై ఈ కథనం...

రెండు నియోజకవర్గాల్లో గ్రంథాలయాలిలా...

మండపేట నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, 43 గ్రామాలు, రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, 77 గ్రామాలు ఉన్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మండపేట పట్టణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రేడ్–1 గ్రంథాలయం ఒకటి, మున్సిపాలిటీ పర్యవేక్షణలో మరొకటి ఉన్నాయి. రాయవరం, మాచవరం, కపిలేశ్వరపురం, అంగర, వెల్ల, ద్రాక్షారామ, పామర్రు, అముజూరు, కాజులూరులలో గ్రేడ్–3 గ్రంథాలయాలు ఉన్నాయి. వల్లూరులో వీడీసీ గ్రంథాలయం, అర్తమూరు, తాపేశ్వరం, తదితర గ్రామాల్లో ప్రైవేటు గ్రంథాలయాలు నడుస్తున్నాయి.

వారోత్సవాలు విజయవంతం

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 14 నుంచి 20 వరకూ నిర్వహించిన జాతీయ గ్రంథాలయ 56వ వారోత్సవాలు విజయవంతం అయ్యాయి. గ్రంథాలయాలతో పాటు మండపేట డిగ్రీ కళాశాల గ్రంథాలయంలో సైతం వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ సత్య డయాగ్నస్టిక్ సెంటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలు కొనుగోలు నిమిత్తం రూ.50 వేలు విరాళాన్ని ప్రకటించారు. వారోత్సవాల్లో నిర్వహించిన పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభించిందని ద్రాక్షారామ, రామచంద్రపురం పట్టణం, పామర్రు, కాజులూరు గ్రంథాలయాల అధికారులు ములంపాక వీరసూరిబాబు, దడాల వెంకటరమణ, ఎస్.గంగాధర్, కె.ప్రసాద్ అన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తి ఆశించిన స్థాయిలో కనిపిస్తోందని మండపేట, రాయవరం, మాచవరం, కపిలేశ్వరపురం గ్రంథాలయాధికారులు ఎస్.పూర్ణమ్మ, ఎస్.రత్నాబాయి, టి.ప్రమీల, దానేటి శివకుమార్ అన్నారు.



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న పాఠకులు

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నాం. గ్రంథాలయాల్లోని విలువైన పుస్తకాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే 90 వేల పుస్తకాలను కంప్యూటరైజ్ చేశారు.

– దూలం పద్మ, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మండపేట

రెండు నియోజకవర్గాల్లో గ్రంథాలయాలు ఇలా...

మండలం	గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో
మండపేట అర్బన్	గ్రేడ్ 3 – 01
రాయవరం	గ్రేడ్ 3 – 02
కపిలేశ్వరపురం	గ్రేడ్ 3 – 02
రామచంద్రపురం	గ్రేడ్ 1 – 01
రామచంద్రపురం రూరల్	గ్రేడ్ 3 – 02
కె.గంగవరం	గ్రేడ్ 3 – 02
కాజులూరు	గ్రేడ్ 1 – 01
మొత్తం	గేడ్–1 రెండు, గ్రేడ్–3 తొమ్మిది

ఉజ్వల భవిష్యత్తుకు లక్ష్యసాధనే పునాది



ద్రాక్షారామలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: లక్ష్య సాధనకు చేసే కృషే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకి పునాది వేస్తుందని కాకినాడ సత్య స్కాన్ అండ్ డయాగ్నస్టిక్స్ సెంటర్ చీఫ్ రేడియాలజిస్ట్ డాక్టర్ కాదా వెంకటరమణ సూచించారు. ద్రాక్షారామ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బుధవారం హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్(హెన్) ప్రాజెక్టు ఆధ్వర్యంలో మేల్ లైఫ్ మీనింగ్ ఫుల్ అనే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శీలం రాకోజురాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ జీవిత గమ్యాన్ని నిర్దేశించేది చదువు మాత్రమేనన్నారు. ఒడిదుడుకులను ఎదుర్కొంటూ జీవితంలో ఎదగాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు అల్లూరి సురేంద్ర మాట్లాడుతూ మానసిక వికాసానికి చదువుతో పాటు మంచి మానవ సంబంధాలు కూడా తోడ్పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గంగుమళ్ల జ్యోతి, హెన్ పీడీ ఎంవీఆర్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి



రైతులను ఆహ్వానిస్తున్న రాజబాబు, ఇతర నాయకులు

కాజులూరు: రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసనగా ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నాను రైతులు విజయవంతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, మహాధర్నా మండల కన్వీనర్ వల్లు రాజబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం సీపీఎం నాయకులు మండలంలోని గ్రామాల్లో కరపత్రాలు, గోడ పత్రికలను పంపిణీ చేశారు. కాజులూరులో రాజబాబు మాట్లాడుతూ అఖిల భారత రైతు సంఘాలు ఢిల్లీలో చేపట్టిన భారీ ఆందోళనకు ప్రధాని దిగివచ్చి, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇది జరిగి రెండేళ్లయినా ఒక్క డిమాండ్ కూడా అమలు కాలేదన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా మహాధర్నాకు అఖిల భారత రైతు సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు సలాది నారాయణ, నామ వీరన్న, యాళ్ల శ్రీనివాసు, దేవు సత్యనారాయణ, పేపకాయల సుబ్బారావు, దొరబాబు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి అసలైన చిరునామా జగన్

- వైఎస్సార్ సీపీ నాయకులు
- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమానికి చిరునామాగా నిలిచారని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని వి.సావరంలో బుధవారం 'వై నీడ్స్ ఏపీ జగన్' కార్యక్రమాన్ని సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న శ్రీనివాసరావు, వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కళ్ళుగా చేసుకుని పాలిస్తోందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మేడిశెట్టి నాగమణి, సొసైటీ చైర్మన్ సిరికి కృష్ణారావు, జేసీఎస్ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణ రెడ్డి, మండల బూత్‌క మిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా..

కపిలేశ్వరపురం: ప్రజల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, టేకి సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు ఉమ్మిడిశెట్టి వీరవేణి అన్నారు. గ్రామంలో బుధవారం 'ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ లబ్ది వివరాల బోర్డును ప్రదర్శించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పేదవారికి అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల అభివృద్ధి

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని అర్తమూరు గ్రామాన్ని ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తోందని స్థానిక సచివాలయం –02లో బుధవారం నిర్వహించిన 'ఆంధ్ర ప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మాజీ వైస్ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను సాగిస్తున్నారన్నారు. ఎంపీపీ ఉండమట్ల వాసు, వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షులు పిల్లా వీరబాబు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రజా క్షేత్రంలో కుటుంబాలకు చేకూరిన ప్రభుత్వ లబ్దితో కూడిన బోర్డును, జెండాను అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఐ.రాజు, పార్టీ యువజన విభాగం నాయకులు గొలుగూరి సందీప్ రెడ్డి, చిర్ల జయరామిరెడ్డి, ఎంపీటీసీ ఎం.సుమలత, పీఏసీఎస్ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, నాయకులు మందా వెంకటరెడ్డి, తేతలి భూపతిరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలనకు జగన్ అవసరం

కె.గంగవరం: పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపర్చేందుకు జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం బాలాంత్రం గ్రామంలో బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. తొలుత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన ప్రచార బోర్డును ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, సర్పంచ్ చాగంటి సాంబశివరావుతో కలసి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను నాయకులతో కలసి ఎగురవేశారు. ఎంపీటీసీ కోట సత్తిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీనివాస్, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా సభ్యుడు బత్తుల అప్పారావు, కన్వీనర్లు కోట శ్రీనివాసు, మాజీ ఎంపీటీసీ పిల్లి నాగజ్యోతి, కోదండ రాముడు తదితరులు పాల్గొన్నారు.



వి.సావరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన సమాచార బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు



టేకి సచివాలయంలో సంక్షేమ పథకాల అమలును వివరిస్తున్న సర్పంచ్ నాగమణి

సీనియర్ సివిల్ జడ్జికి వీడ్కోలు



జడ్జి మాధవీదేవిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

రామచంద్రపురం: బదిలీపై వెళుతున్న రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవికి రామచంద్రపురం బార్ అసోసియేషన్ బుధవారం ఘనంగా వీడ్కోలు పలికింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ 26 నెలల పాటు న్యాయమూర్తిగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. జూనియర్ సివిల్ జడ్జి వి. నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ న్యాయపరమైన అంశాలు, ఉచిత న్యాయ సాయంపై న్యాయవాదులకు అవసరమైన న్యాయ పరిజ్ఞానాన్ని కల్పించారన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు జడ్జి కె.మాధవీదేవికి దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, కార్యవర్గ సభ్యులు సత్యవాణి, చిన్నం వీర్రెడ్డి, పిల్లా పృథ్వీ, వీవీఆర్ సుబ్రహ్మణ్యం, వి.గోపాలరావు, బినయ్‌బాబు, ఆర్‌వీజీ మణిబాబు, అల్లం గనిరాజు, దొమ్మలపాటి సత్యనారాయణ, ఐ.గంగాధర్, కేవీవీ సత్యనారాయణ, జాన్ రత్నం, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీఠంలో వైభవంగా లక్ష బిల్వార్చన



హసన్‌బాద భీమేశ్వరాలయ ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన



భవానీశంకర అష్టమలింగేశ్వరస్వామికి నిర్వహిస్తున్న ఏకవార రుద్రాభిషేకం

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో బుధవారం వైభవంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు.పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) నేతృత్వంలో భవానీశంకర అష్టమ లింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు, వినాయకునికి అభిషేకం, గరిక పూజ నిర్వహించారు. కార్తీక శుద్ధ దశమిని పురస్కరించుకుని పీఠంలో శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తులసీ దళార్చన, సుబ్రహ్మణ్యస్వామికి పుష్పార్చన, భవానీశంకర సమేత అష్టమలింగేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, విజయదుర్గమ్మవారికి లక్ష బిల్వార్చనలు నిర్వహించారు. పీఠాధిపతి గాడ్ కార్తికమాసం విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఆర్వో పి.వేణుగోపాల్, పీఠం ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, సత్యకనకదుర్గ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో జ్యోతిర్లింగార్చన

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ అర్చకుడు ఉండి వీరభద్రశర్మ బ్రహ్మత్వంలో విశేష లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, మూర్తి హోమం, మూల మంత్ర హోమం, కుంకుమ పూజ జరిపారు. అనంతరం లక్ష వత్తులతో జ్యోతిర్లింగార్చన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొత్త ఓటరు నమోదు కార్యక్రమం

కపిలేశ్వరపురం (మండపేట): విద్యార్థులు లక్ష్యంగా బుధవారం నూతన ఓటరు నమోదు కార్యక్రమాలను బీఎల్‌ఓలు ప్రారంభించారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు ఆదేశాల మేరకు అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాలలో వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 18 ఏళ్లు నిండిన, నిండబోతున్న విద్యార్థుల నుంచి ఫారాలు స్వీకరించారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై వీఆర్వో నాగమణి అవగాహన కల్పించారు.

మండపేటలో...

స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా మండపేట మున్సిపాలిటీ పరిధిలోని విజ్ఞాన్, విద్యా వికాస్ డిగ్రీ కళాశాలలు, వైష్ణవి ఒకేషనల్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల నుంచి నూతన ఓటు హక్కు కోరుతూ ఫారాలను స్వీకరించారు. ఓటరు నమోదు అధికారి ఎస్.సుధాసాగర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి ఒకటి, ఏప్రిల్ ఒకటి, జూలై ఒకటి, అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన విద్యార్థుల నుంచి ఫారాలను స్వీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ ఓటరు నమోదు అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.



మండపేటలో విద్యార్థుల నుంచి ఫారాలు స్వీకరిస్తున్న సిబ్బంది

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాజులూరు: కాజులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. డీఈ మాట్లాడుతూ విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి విద్యుత్ లైన్లలోని గృహాలకు, ఇండస్ట్రియల్ ఫీడర్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్నారు.

జోరందుకున్న ఖరీఫ్ పనులు

- వాతావరణ ప్రభావంతో ముమ్మరం
- తప్పని యంత్రాల వినియోగం
- పంటను రక్షించుకోవడంలో నిమగ్నం



కోతకు వచ్చిన పంటను కోస్తున్న కూలీలు



కోసిన పంటను పనలుగా కట్టి గట్టుకు చేరుస్తూ..



యంత్రాల సాయంతో పనల నుంచి గింజలను వేరుచేస్తూ..



వేరు చేసిన అనంతరం ధాన్యాన్ని రాశులుగా వేస్తూ..

కె.గంగవరం: ఖరీఫ్ వరి సాగు ఆశాజనకంగా ఉండడంతో రైతులు కోతలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఆరు గాలం శ్రమించి పండించిన పంటను చేతికందించుకునేందుకు రైతులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వర్షాలు, తెగుళ్ల నుంచి పంటను పూర్తి స్థాయిలో రక్షించుకుని.. ప్రస్తుతం కోతలు కోసి, యంత్రాల సాయంతో నూర్పిళ్లు కూడా మొదలు పెట్టారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. రెండు రోజులుగా వాతావరణం మేఘావృతమై ఉండడంతో రైతులు కలవరపడుతున్నారు. దీంతో పొలంలోనే ఉండి వీలైనంత త్వరలో పంటను రక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వాతావరణం పూర్తిగా అనుకూలిస్తే మరో పది రోజుల్లో పూర్తి స్థాయిలో ఖరీఫ్ పనులను ముగించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. మూడేళ్లుగా వరి పంట వల్ల నష్టాలు వచ్చాయని, ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉండడంతో చేసిన అప్పులు తీరుస్తామని రైతులు అంటున్నారు.